హితబోధ



# సండే స్కూల్ పాఠాలు

శ్రీమతి ఫ్రాన్సిస్ ఫాంటెన్



# కాపీరైట్

**హితబోధ సండే స్కూల్ పాఠాలు:**
**రచయిత**: శ్రీమతి ఫ్రాన్సిస్ ఫౌంటెన్
**అనువాదం**: శ్రీమతి జి. విజయ లక్ష్మి
**కాపీ టైపిస్ట్**: శ్రీ వై. దివాకర్ రెడ్డి

**యాక్టివిటీ**: శ్రీమతి రూత్ ఫౌంటెన్ (UK)
**అనుసరించి చేసినవారు**: శ్రీమతి వై. మెర్సీ దీప్తి (ఇండియా)

**కవర్ డిజైన్ & యాక్టివిటీ ఎడిటింగ్**: గ్రేస్ డిజైన్ స్టూడియో, హైదరాబాద్.
(వెబ్‌సైట్: www.itsgdstudio.com)

కాపీరైట్ నోటీసు:

* వాణిజ్య ప్రయోజనాల కోసం ముందుగా పబ్లిషర్ దగ్గర నుండి వ్రాతపూర్వక అనుమతి లేకుండా ఈ ప్రచురణ లోని ఏ భాగం కూడా, ఎటువంటి రూపంలో అంటే – ఫోటో కాపీ, రికార్డింగ్, ఎలక్ట్రానిక్ మరియు ఏ ఇతర పద్ధతుల ద్వారా తిరిగి ప్రచురించడం గాని, పంపిణీ చేయడం గాని, ప్రసారం చేయడం గాని చేయకూడదు.

* వాణిజ్యేతర ప్రయోజనాల కోసం, ఈ ప్రచురణలో ఉన్న మెటీరియల్ ని ఎలాంటి మార్పులు చేయకుండా ఉచితంగా పంపిణీ చేయవచ్చు.

హితబోధ ( hithabodha.com ), భారతదేశం ద్వారా ప్రచురించబడింది.
©Mayflower Christian Bookshop వారి అనుమతితో,
స్ప్రింగ్ రోడ్ ఎవాంజెలికల్ చర్చి,
సౌతాంప్టన్, UK.
అన్ని హక్కులు ప్రత్యేకించబడ్డాయి.

# ఉపాధ్యాయులకు ఉపదేశము

సండే స్కూల్ విద్యార్థులకు బోధిస్తున్న ఒక టీచర్ ద్వారా ఈ బైబిల్ పాఠాలు వ్రాయబడ్డాయి. టీచర్లు ఎవరి పద్ధతిలో వారు బోధించినప్పటికి, ఇవి వారి సిద్ధపాటులో ఎంతగానో సహాయపడాలి అని మా ప్రార్థన.

**పాఠ్య భాగము వివరణ యొక్క లక్ష్యం:**

* బైబిల్ లో వ్రాయబడిన భాగాలను వివరముగా తెలియజేస్తూ, వాటికి ఇతర వాక్యభాగాలతో గల సంబంధమును తెలుపుట.
* పిల్లల మధ్య పరిచర్య చేయనివారు కూడా సులభమైన రీతిలో బోధించుటకు సహాయపడుట.
* చిన్న పిల్లలకు బైబిల్ లోని ప్రదేశాలు, పరిస్థితులు, వ్యక్తుల గురించిన పూర్తి సమాచారాన్ని బోధించుట. కానీ బైబిల్ లో లేని విషయాలను ఇది ఖచ్చితమైనవి అని ఎంత మాత్రము బోధించ కూడదు. అటువంటి సమయాలలో " బహుశా, కాబోలు ,ఊహించ వచ్చు, ఉండవచ్చు అను కొనవచ్చు" అనే పదాలను వాడాలి. ఉదాహరణ: గొర్రెల కాపరి ఎంతో సంతోషంగా పాటలు పాడుతూ గొర్రెలను మేపుతూ ఉండవచ్చు.
* ప్రతి పాఠం యొక్క ఉద్దేశము,లక్ష్యం, ముఖ్యాంశములను గురించి వివరించడం మంచిది.

**పాఠములను బోధించుటకు సిద్ధపాటు:**

* మీరు చెప్పబోయే పాఠ్య భాగము ముందుగా మీ హృదయాలకు ఆశీర్వాదకరంగా ఉండునట్లు ప్రార్థించండి. వారము మొదటి రోజు నుండే మీరు సిద్ధపడితే బాగుంటుంది అని సూచన.
* సూచించబడిన బైబిల్ భాగాలను, వచనాలను తప్పకుండా చదవండి. పాఠంలోని ప్రధానమైన విషయాలు, ముఖ్య సందేశముల మీద ఎక్కువ దృష్టి ఉంచండి.
* మీరు సిద్ధపడుతున్న సమయములో క్రింది విషయాలు గుర్తుంచుకోవడం మంచిది.
  - పిల్లల వయస్సు
  - బైబిల్ పట్ల వారికి ఉన్న జ్ఞానం
  - క్రైస్తవ సిద్ధాంతాల పట్ల వారికి ఉన్న అవగాహన
* పాఠ్యభాగము లను ఎక్కువ సార్లు చదవడం వలన క్లాసులో మీ నోట్స్ పిల్లల ముందు చూడవలసిన అవసరం ఉండదు
* పిల్లలు శ్రద్ధగా, ఆసక్తిగా వినడానికి కొన్ని బొమ్మలు పెయింటింగ్స్ వాడితే మంచిది.

**పాఠములను బోధించు విధానము:**

* సండే స్కూల్ కు వారి బైబిల్ ను తెచ్చుకొన వలసినదిగా పిల్లలను ప్రోత్సహించండి. వారి ముందు మీ బైబిల్ తెరచి ఉంచడం మంచిది. పిల్లల వయస్సు ఆధారంగా ఒకటి లేదా రెండు వచనాలు మాత్రం చదివించండి.
* పిల్లలు అర్థం చేసుకునే శక్తిని అనుసరించి స్పష్టంగా, వివరంగా, సులభంగా బోధించండి. ఎక్కువ సమయం పిల్లలకు ఏకాగ్రత ఉండదు అని గుర్తుంచుకోండి.
* ముందు పాఠాలలో నేర్చుకున్న విషయాలను తిరిగి గుర్తు చేయడం మంచిది.
* క్రైస్తవ విశ్వాసానికి పునాది వంటి సత్యాలను వారికి మరల మరల గుర్తు చేయండి.
  - ఉదాహరణ: బైబిల్ సత్యమైనది
  - యేసుప్రభువు నిజమైన దేవుడు

– మిమ్మల్ని ప్రశ్నలు అడగడం ద్వారా వారికి ఉన్న సందేహాలు అనుమానాలు

– పోగొట్టుకోవడానికి ప్రోత్సహించండి.

* పిల్లలకు ఉన్న భయాలు, ఆందోళనలు, సమస్యలు మీతో భయం లేకుండా చెప్పగలిగిన స్వేచ్ఛ వారికి కలిగించండి. వారి పట్ల ప్రేమను శ్రద్ధ కనపరచండి.

* ప్రార్థనతో మీ క్లాస్ ను ముగించండి.

# విషయాలు

1. Series 1: సృష్టి నుండి బాబెలు - పరిచయం . . . . . . . . . . . . . . . . . . . . 1
2. నోవహు కృతజ్ఞతార్పణ చెల్లించుట . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 2

## అధ్యాయము 1: Series 1: సృష్టి నుండి బాబెలు - పరిచయం

ఈ పాఠ్య భాగములు అత్యంత ప్రధానమైనవి. ఎందుకంటే సృష్టికి సంబంధించిన సత్యాలు వీటిలో వివరించబడ్డాయి. పరిణామ సిద్ధాంతం గురించి ఎంతో స్వేచ్ఛగా స్కూల్ లో విద్యార్థులకు బోధిస్తున్న ఈ దినాలలో సత్యాన్ని వారికి సరిగా వివరించుటకు ఇది చక్కని అవకాశం. దేవుని సత్యాలు వారి హృదయాలలో నాటబడునట్లు ప్రార్థించవలసిన అవసరత ఎంతో ఉంది. ఆదికాండములో మొదటి 11 అధ్యాయముల నుండి ప్రస్తుత పాఠ్య భాగములు తీసుకొనబడినవి. మీకు చక్కగా అర్థం కావడానికి ముందుగా ఈ అధ్యాయాలు చదువుకుంటే మంచిది.

* దేవుడు ఎవరు? – ఆయన గొప్ప సృష్టికర్త. ఆయన శక్తిమంతుడు, జ్ఞానవంతుడు, ప్రేమామయుడు, దయ కలిగిన వాడు, సృష్టికి అవసరమైన వాటన్నింటిని సమకూర్చే వాడు (1–4 పాఠాలు).

* మానవుడు ఎలాంటివాడు? – మానవుడు అవిధేయత,చెడుతనము, అపనమ్మకముతో నిండి తనకు ఇష్టమైన త్రోవలో నడిచేవాడు, పరిశుద్ధుడైన దేవుని న్యాయవిధులు కంటె, సాతాను యొక్క చెడు ఆలోచనలు అనుసరించేవాడు (5–7,9–10 పాఠాలు).

* పాపక్షమాపణకై దేవుని మార్గము – ఆదాము హవ్వల ద్వారా లోకములో పాపము ప్రవేశించింది, కాని దేవుడు తన కృపను బట్టి రక్తము ద్వారా పాపుల రక్షణకై మార్గాన్ని ఏర్పరిచాడు. యుక్త కాలమున దేవుని గొర్రెపిల్లగా లోకరక్షకుని గా ప్రభువైన యేసు ఈ భూమి మీదకు వచ్చి సాతాను అధికారాన్ని నాశనం చేశాడు. (6–7 పాఠాలు).

* దేవుని మార్గమును తృణీకరిస్తున్న మానవుడు – దేవుని హెచ్చరికలను దయను, సహనాన్ని మానవులు తిరస్కరిస్తూనే ఉన్నారు. జలప్రళయము తరువాత కూడా కయీను, నోవహు దినములలో వలె వారికి ఇష్టమైన చెడు త్రోవలో మానవులు నడుచుట 12వ అధ్యాయములో స్పష్టంగా చూడవచ్చు. అందువలన వారికి శిక్ష తప్పలేదు.

బైబిల్ మొత్తం అర్థం చేసుకోవడానికి ఈ అధ్యాయాలు పునాది వంటివి. ఆదికాండమును కొన్నిసార్లు "ఆదికాండము సువార్త" అని అంటారు. మానవ పతనము తరువాత దేవుడు ఏర్పరచిన రక్షణ మార్గమును మనము ఈ అధ్యాయాలలో స్పష్టంగా చూడగలము (హెబ్రీ 9:22).

# అధ్యాయము 2:   నోవహు కృతజ్ఞతార్పణ చెల్లించుట

**ఆదికాండము 8:1-9:19**

**ఉద్దేశము/లక్ష్యము**: జలప్రళయము నుండి నోవహును కాపాడిన ప్రభువు నమ్మదగినవాడు, వాగ్దానములు నెరవేర్చువాడు అని బోధించుట.

**ముఖ్యాంశము**: వాగ్దానములు – మీ పుట్టినరోజుకు మంచి బహుమానం ఇస్తాను అని మీ నాన్నగారు వాగ్దానం చేశారు అనుకోండి, కాని ఆరోజు ఏమి ఇవ్వలేదు అనుకుందాము. మీ నాన్నగారు మాట తప్పినందుకు మీకు ఎంతో బాధ, నిరాశ కలుగుతాయి. అంతేకాకుండా ఇంకెన్నడూ మీ నాన్నగారి మాటలు నమ్మకూడదు అని మనస్సులో అనుకుంటారు కదా! కానీ మనము అందరము ఏదో ఒక సమయంలో మాట తప్పుతుంటాము. స్కూల్ లో ఫస్ట్ గ్రేడ్ తెచ్చుకుంటాను, గదిని శుభ్రంగా ఉంచుకుంటాను, కుక్కను బయటకు తీసుకెళ్తాను ఇలా ఎన్నో మాటలు చెప్తుంటాము, కానీ వెంటనే మరచిపోతాము, లేదా మనస్సు మార్చుకుంటాము. ఆ మాటలు ఉపయోగం లేనివిగా మిగిలిపోతాయి. కానీ దేవుడు మన వంటివాడు కాదు, దేవుడు ఎన్నడూ మాట తప్పనివాడు అని మీకు తెలుసా!

**గతవారము**: చెడ్డవారైన జనులందరిని నాశనం చేసి, నోవహును, అతని కుటుంబమును కాపాడుతాను అని దేవుడు నోవహుకు వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానాన్ని దేవుడు యధాతథంగా నెరవేర్చాడు. దేవుడు భూమిపైకి జలప్రళయము పంపిన విషయము గతవారం చూశాము. 40 రోజులు రాత్రింబగళ్ళు ఎడతెరిపి లేకుండా కురిసిన ప్రచండ వర్షము వలన అన్నీ నీటిలో మునిగి నశించిన విషయం కూడా చూశాము. కాని నోవహును, అతని కుటుంబమును దేవుడు ఓడలో క్షేమంగా కాపాడాడు.

**ఓడలో వేచి యుండుట**: ఎన్నో వేల అడుగుల ఎత్తులో నీటిపై తేలుతున్న ఓడ నుండి నోవహు బయటపడటం సాధ్యమేనా? కాదు, కాని దేవుడు సమస్తమును తన స్వాధీనంలో ఉంచుకొని యున్నాడు. 150 దినముల(5 నెలలు) తరువాత దేవుడు భూమి మీద గాలి వీచునట్లు చేయుటవలన నీళ్లు తగ్గిపోయాయి (8:1). నీళ్లు క్రమక్రమముగా తగ్గిపోతూ వచ్చాయి. ఏడవనెల 17వ దినమున ఓడ అరారాతు కొండలమీద నిలిచింది(8:4). తరువాత 10వ నెల మొదటి దినమున కొండల శిఖరములు కనబడ్డాయి. ఆ కొండ శిఖరములు చూసిన వెంటనే నోవహు ఎంతగానో సంతోషించి ఉంటాడు!

తరువాత 40 దినములకు నోవహు ఓడ కిటికీ తీసి భూమిఎండినది, లేనిది చూచుటకు ఒక కాకిని వెలుపలికి విడిచిపెట్టాడు. ఆ ఓడలోనుండి భూమి ఆరినది లేనిది నోవహుకు కనిపించలేదు. ఆ కాకి బయటకు వెళ్లి భూమి మీద నుండి నీళ్ళు ఇంకిపోవు వరకు ఇటు అటు తిరుగులాడసాగింది. దానికి బయట ఆహారం దొరికి ఉండవచ్చు గనుక తిరిగి ఓడలోనికి రాలేదు. నోవహు తిరిగి నీళ్లు నేలమీద నుండి తగ్గినవో, లేదో చూచుటకు ఒక నల్ల పావురమును వెలుపలికి విడిచిపెట్టాడు. నీళ్లు భూమి అంతటి మీద ఉన్నందువలన అరకాలు నిలుపుటకు కూడా పావురమునకు స్థలము దొరకలేదు కనుక తిరిగి ఓడలో ఉన్న నోవహు దగ్గరకు వచ్చింది. నీరు ఇంకా ఎండి పోలేదు అని నోవహుకు అర్థమైంది. నోవహు ఇంకా ఏడు దినములు ఆగి మరల నల్ల పావురమును ఓడలోనుండి వెలుపలికి విడిచిపెట్టాడు. సాయంకాలమున అది నోవహు దగ్గరకు వచ్చినప్పుడు త్రుంచ బడిన ఒలీవ చెట్టు ఆకు దాని నోటిలో ఉంది. అప్పుడు భూమి మీద నుండి నీళ్లు తగ్గిపోయాయి అని నోవహు అర్థం చేసుకున్నాడు.

ఇంకా 7 దినముల తరువాత ఆ పావురమును మరల విడిచిపెట్టగా,అది నోవహు యొద్దకు తిరిగి రాలేదు. అది ఆహారము సంపాదించి చెట్లపై కూర్చుని తినుటకు వీలుగా భూమి ఆరిపోయి ఉండవచ్చు. నోవహు ఓడ కప్పు తీసి చూచినప్పుడు నేల ఆరిపోయింది. కాని దేవుడు చెప్పిన సమయంలోనే వారు ఓడలోనుండి బయటకు రావాలి గనుక దేవుని మాట కొరకు వారు ఎదురుచూస్తున్నారు. నీరు తగ్గి పోయినప్పటికీ భూమి బురదగా ఉండి ఉండవచ్చు.

దేవుడు నీవును, నీతో కూడా నీ భార్య, నీ కుమారులు, నీ కోడండ్రు ఓడలో నుండి బయటకు రమ్మని చెప్పాడు. అంతేకాక ఓడలో ఉన్న పక్షులు పశువులు భూమిమీద ప్రాకు ప్రతి జాతి పురుగులు, సమస్త శరీరులలో నీతో కూడా ఉన్న ప్రతి జంతువును వెంటబెట్టుకుని వెలుపలికి రావలెను అని చెప్పాడు. అన్ని నెలల తరువాత తిరిగి భూమి మీద నడవడం

ఎంత అద్భుతమైన అనుభవం! వారు దాదాపు ఒక సంవత్సరం పాటు ఓడలో ఉన్నారు. జంతువులు, పక్షులు బయటకు వచ్చి పరిగెత్తుతూ, ఎగురుతూ, స్వేచ్ఛగా వెళ్ళిపోయి ఉంటాయి. అవి భూమి మీద బహుగా విస్తరించి ఫలించి అభివృద్ధి పొందవలెను అని దేవుడు నోవహు తో చెప్పాడు (8:17;9:1). ఎంత సంతోషకరమైన సమయం!

**నోవహు యొక్క కృతజ్ఞతార్పణ**: ఓడలోనుండి బయటకు వచ్చిన తరువాత నోవహు చేసిన మొదటి పని ఏమిటో తెలుసా? ఇల్లు కట్టుకొని పనులు చేసుకోవాలి అని తలంచకుండా, తన వాగ్దానము చొప్పున క్షేమంగా తమను కాపాడిన దేవుని కృపను జ్ఞాపకము చేసికొని కృతజ్ఞతలు చెల్లించాలి అనుకున్నాడు. నోవహు వెంటనే ఒక బలిపీఠము కట్టి పవిత్ర పశువు లన్నిటిలోను, పవిత్ర పక్షులన్నిటిలోను కొన్ని తీసుకుని ఆ బలిపీఠముమీద దహనబలిగా అర్పించాడు. దేవుడు చూపిన కనికరమును బట్టి కృతజ్ఞతకు సూచనగా బలి అర్పించాడు. అంతేకాక తమ పాపక్షమాపణ నిమిత్తము కూడా దహనబలిని అర్పించి ఉండవచ్చు. అప్పుడు దేవుడు ఆ ఇంపైన సువాసనను బట్టి సంతోషించాడు. దేవుడు మానవులకు అప్పటినుండి కూర మొక్కలతో పాటు ప్రాణముగల సమస్తజీవులను మీకు ఆహారముగా ఇస్తున్నాను అని చెప్పాడు (9:3). అప్పటివరకు మానవులు కూరగాయలను, మొక్కలను, పండ్లను మాత్రమే ఆహారముగా తీసుకునేవారు.

**దేవుని వాగ్దానము**: దేవుడు అప్పుడు నోవహుతో ఒక నిబంధన చేశాడు. ఇకమీదట నరులను బట్టి మరల భూమిని శపించను. ఇప్పుడు చేసిన ప్రకారముగా ఇక సమస్త జీవులను సంహరింపను అని నిబంధన చేశాడు. మేఘములో ధనుస్సు ఉంచి అది దేవునికి, భూమికి మధ్య నిబంధనకు గుర్తుగా ఉంటుంది అని చెప్పాడు. భూమిపైకి దేవుడు మేఘము పంపించినప్పుడు ఆ ధనుస్సు మేఘములో కనిపిస్తుంది. అప్పుడు దేవునికి, మానవులకు, సమస్త జీవరాశులకు మధ్యనున్ననిబంధన దేవుడు జ్ఞాపకము చేసికొని నాశనము చేయునంతగా జలప్రవాహము పంపడు గనుక నాశనము చేయుటకు జలములు ప్రవాహముగా రావు అని తన నిబంధనను వివరించి చెప్పాడు. దేవుడు ఆ నిబంధనను మనందరితో కూడా చేస్తున్నాడు. మనము ఆకాశములో ఇంద్రధనుస్సును చూచిన ప్రతిసారి దేవుని నిబంధనను, వాగ్దానాన్ని గుర్తు చేసుకోవాలి.

**సందేశము**: మానవుల పాపము, చెడుతనము వలన దేవుడు వారిని శిక్షించవలసి వచ్చింది. దేవుడు నిజముగానే భూమి మీదకు జలప్రళయము పంపించాడు. దేవుడు ఓడలోని నోవహును, అతని కుటుంబమును, పక్షులను, జంతువులను, ప్రాకు పురుగులను కాపాడి క్షేమంగా ఉంచాడు. మరెన్నడూ భూమిమీదకు జలప్రళయము పంపను అని దేవుడు నిబంధన చేశాడు. ఆయన నమ్మదగినవాడు. దేవుడు పాపమును ఓర్చుకొనలేడు అని ఈ కథ ద్వారా మనము తెలుసుకున్నాము. అంతేకాక ఆయన కనికరము గలవాడు మరియు వాగ్దానము నెరవేర్చేవాడు అని కూడా మనము తెలుసుకొనగలిగాము.

**అన్వయింపు**: ఆకాశములో ఇంద్రధనస్సు మీరెప్పుడైనా చూశారా? అది ఎంత అందంగా ఉంటుంది కదూ! అందులో ఏమి రంగులు ఉంటాయి తెలుసా? ఎరుపు, ఆరెంజ్, పసుపు, ఆకుపచ్చ, నీలము, ఇండిగో మరియు వంగపండు రంగులు ఉంటాయి. మనము ఇంద్రధనస్సు చూచినప్పుడు దేవుని నిబంధన గుర్తు చేసుకోవాలి. లోకములో కలుగుతున్న ప్రమాదాలు చూసి మనము భయపడవలసిన అవసరంలేదు, ఎందుకనగా దేవుడు మాట తప్పనివాడు. దేవుడు తన ప్రజలకు ఎన్నోవాగ్దానాలు చేశాడు. హృదయపూర్వకంగా ఆయనకు ప్రార్థించినప్పుడు వారి ప్రార్థనలు వింటాను అని మాట ఇచ్చాడు (కీర్తన 34:17). ఆయనను విశ్వసించేవారు నడువవలసిన మార్గమును చూపుతాను అని చెప్పాడు (సామెతలు 3:6).

వీటన్నిటికంటె అద్భుతమైన వాగ్దానం ఒకటి ఆయన చేశాడు – ప్రభువైన యేసు తిరిగి భూమిపైకి వస్తాడు అనేదే ఆ వాగ్దానం. కాని ప్రభువైన యేసు రెండవసారి పసిబాలుడిగా కాక గొప్ప రాజు గా రాబోతున్నాడు. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను ప్రభువువస్తాడు అని బైబిల్ లో వ్రాయబడింది (1 థెస్స. 4:17). ఆయనయందు విశ్వాసముంచినవారు, ఆయనను ప్రేమించేవారు ఆయనతో కూడా సదాకాలము ఉండుటకు పరలోకమునకు తీసికొని పోబడతారు. అక్కడ వారు దేవునితో కలిసి సదాకాలము సజీవులుగా ఉంటారు. ఆ దినము క్రైస్తవ విశ్వాసులకు ఎంతో ఆశీర్వాదకరమైనది, కాని పాపక్షమాపణ పొందకుండా యేసును విశ్వసించని వారికి అది ఎంతో భయంకరమైన దినము. వారు తప్పక దేవుని తీర్పును, శిక్షను ఎదుర్కొనవలసిన వారై ఉన్నారు (2 పేతురు 3:7). నోవహు వలె మనం కూడా ప్రభువు మాటలు విశ్వసించి క్షేమంగా ఉందాము. దేవుని వాగ్దానములు నమ్మదగినవి గనుక ఆయన మనలను కాపాడి సంరక్షిస్తాడు. అయన చేసిన ఉపకారములను బట్టి నోవహు వలె మనం కూడా కృతజ్ఞతలు చెల్లించాలి.


**కంఠతవాక్యము**: వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు(హెబ్రీ. 10:23)

# నోవహు కృతజ్ఞతార్పణ చెల్లించుట



# నోవహు కృతజ్ఞతార్పణ చెల్లించుట

ఓడను కత్తిరించి కింద కొండ దగ్గర అతికించండి.





# పదాలను వెతకండి

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| య | ఋ | శ | ఘ | ఆ | ఘ | ఆ | ఘ | ఋ | ప |
| కృ | త | జ్ఞ | త | ని | బం | ధ | న | ఘ | ఆ |
| ప | బ | హు | మా | నం | శ | ఏ | ర | య | ఛ |
| ర | ఢ | ఘ | ప | సం | వ | త్స | ర | ము | ర |
| లో | ఆ | ఋ | ర | ఢ | స్వే | ఋ | భి | ప | త |
| క | ఆ | ఏ | భ | శ | చ్ఛ | ర | ఘ | ఆ | ర |
| ము | పా | య | ప | ఫ | ఘ | ప | భ | భ | శ |
| త | వు | ర | ప | ల | య | శ | ఏ | ఘ | ఛ |
| భి | రం | భ | శ | ము | ఏ | త | ఋ | శ | ఢ |
| ఛ | శ | ఆ | ప | ఋ | ప | ఆ | య | భి | శ |

మీకు ఇవ్వబడిన ఈ పదాలను పైన ఉన్నయాక్టివిటీలో గుర్తించండి.

1. కృతజ్ఞత
2. బహుమానం
3. పావురం
4. స్వేచ్ఛ
5. ఫలము
6. సంవత్సరము
7. నిబంధన
8. పరలోకము